# ఉప్పొంగిన భక్తిభావం

- తొలిరోజు మానవీయ విలువలపై చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు
- హాజరైన 6800 మంది ప్రజలు
- సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రారంభమైన మూడు రోజుల కార్యక్రమం
- సేవలందిస్తున్న 400 మంది వలంటీర్లు

సిద్దిపేట, సెప్టెంబర్ 30 : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాల కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో శనివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ప్రవచన కార్యక్రమం తొలిరోజు మంత్రి హరీశ్‌రావు కోరిక మేరకు మానవీయ విలువలపై చాగంటి ప్రవచనాలు చెప్పారు. ఈ కార్యక్రమానికి 6800 మంది హాజరయ్యారు. సభా ప్రాంగణం పూర్తిగా నిండిపోగా, చాలామంది సమావేశ ప్రాంగణంలో నిలబడి విన్నారు. కార్యక్రమానికి వచ్చిన ప్రేక్షకులకు మూడు రకాల అల్పాహారాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ కాపాడేందుకు ప్లాస్టిక్ వస్తువులను వినియోగించకుండా పట్టణంలోని స్టీల్ బ్యాంకులు నుంచి స్టీల్ ప్లేట్లను గ్లాసులను సేకరించి అల్పాహారం అందించనున్నారు. మూడు రోజులు సేవలందించడానికి 255మంది మహిళా వలంటీర్లు, 140 మంది పురుష వలంటీర్లను నియమించారు. కార్యక్రమం సందర్భంగా కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు.



ప్రసంగిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు





విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



ప్రవచన కార్యక్రమానికి హాజరైన ప్రజలు

## పాడి ఉత్పత్తులను పెంచడమే లక్ష్యం



అక్కెనపల్లిలో పాల క్యాన్లను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

నంగునూరు, సెప్టెంబర్ 30 : పాడి ఉత్పత్తులను పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విజయ డెయిరీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్నదని సర్పంచ్ వెంకటేశం అన్నారు. నంగునూరు మండలం అక్కెనపల్లిలో విజయపాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం పాడి రైతులకు పాల క్యాన్లను డైరీ సూపర్‌వైజర్లు లింగం, రామస్వామితో కలిసి సర్పంచ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే సంకల్పంతో విజయ డెయిరీ రైతులకు పలు పథకాలను అమలు చేస్తున్నదన్నారు. ప్రభుత్వ పథకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ నాగేందర్, ఉప సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, బీఎంసీ చైర్మన్ రాజు, రాజేందర్, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు బైరి రాజు, పాలకవర్గ సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

## మొక్కలను నాటి, సంరక్షించాలి

సిద్దిపేట టౌన్, సెప్టెంబర్ 30 : మొక్కలను నాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైన ఉందని నేచర్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ అయోధ్యరెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15 నుంచి అక్టోబర్ 2 వరకు చేపట్టిన స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా కళాశాల ఆవరణలో శనివారం విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. చెట్టు జీవకోటికి ప్రాణాధార అని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు మధుసూదన్‌రెడ్డి, పుణ్యమ్మ, వైకుంఠం పాల్గొన్నారు.

## స్కూల్ గేమ్స్ విజేతలు

సిద్దిపేట, సెప్టెంబర్ 30 : ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికలకు వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు. అండర్-14 (బాలికల)లో జగదేవ్‌పూర్ మండలం ప్రథమ స్థానం, సిద్దిపేట రూరల్ రెండోస్థానం, సిద్దిపేట అర్బన్ మూడో స్థానంలో నిలిచాయి. అండర్-17లో జగదేవ్‌పూర్ మండలం మొదటిస్థానం, కుకునూరుపల్లి రెండోస్థానం, సిద్దిపేట అర్బన్, దుబ్బాక మండలాలు మూడో స్థానంలో నిలిచాయని నిర్వాహకులు తెలిపారు. అండర్ -14 వాలీబాల్ పోటీల్లో బాలికల విభాగంలో గజ్వేల్ మండలం ప్రథమస్థానం, నంగునూర్ రెండో స్థానం, రాయపోల్ మూడోస్థానంలో నిలిచాయి. అండర్-17లో దుబ్బాక, దౌల్తాబాద్, నంగునూరు జట్లు నిలిచినట్లు వివరించారు.

## సంతోషిమాత ఆలయ హుండీ లెక్కింపు

సిద్దిపేట టౌన్, సెప్టెంబర్ 30 : పట్టణంలోని పటేల్‌పురవీధిలో వెలిసిన సంతోషిమాత ఆలయ హుండీని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు పర్యవేక్షణలో శనివారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథ్‌శర్మ, ఆలయ చైర్మన్ నవీన్ మాట్లాడుతూ.. అమ్మవారికి 57 రోజుల్లో రూ.2,20,347 ఆదాయం వచ్చిందన్నారు. వెండి, బంగారు మిశ్రమాలను తిరిగి హుండీలో వేశామన్నారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయశాఖ పరిశీలకుడు రవికుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు సత్యనారాయణగౌడ్, అమర్‌నాథ్, కల్యాణి, సువర్ణ, మధుసూదన్‌శర్మ, సంతోషిమాత సేవా సమితి, మాతృ మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

### బతుకమ్మ చీరల

## పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

సిద్దిపేట, సెప్టెంబర్ 30 : బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడపడుచులకు ప్రభుత్వం ఇస్తున్న బతుకమ్మ చీరల పంపిణీ ప్రక్రియను అక్టోబర్ 4 నుంచి ప్రారంభిస్తున్నట్లు, ఇందుకు ఏర్పాట్లు చే స్తున్నట్లు చేనేత, జౌళిశాఖ సహాయసంచాలకుడు సంతోష్‌కుమార్ తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా మహిళలకు బతుకమ్మ చీరలు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అర్హులైనవారు 3,83,832 మంది ఉండగా, ఇప్పటి వరకు 2,74,600 చీరలు వచ్చాయన్నారు. వీటిని హుస్నాబాద్‌లోని ఏఎంసీ గోదాంలో భద్రపరిచినట్లు తెలిపారు. మిగతా చీరలు రెండు, మూడు రోజుల్లో వస్తాయన్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలి

జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 30 : పంచాయతీరాజ్‌శాఖ టెక్నికల్ వ్యవస్థలో పని చేస్తున్న 33 మంది డీపీఎంలు, కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేస్తున్న 1619 మందికి ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు పేస్కేల్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. డీపీఎం పురుషోత్తంరెడ్డి, పంచాయతీ రాజ్ ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్, ప్రధానకార్యదర్శి నర్సింహులు ఆధ్వర్యంలో శనివారం జడ్పీసీఈవో రమేశ్, డీపీవో దేవకీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అన్నిరకాల ఆన్‌లైన్ సేవలను ఈ-పంచాయతీ ఆపరేటర్లు నిర్వహిస్తారన్నారు. పల్లె ప్రగతి, స్వచ్ఛభారత్ తదితర అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో రాష్ట్రానికి జిల్లాకు కేంద్ర ప్రభుత్వ నుంచి అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. డీపీఎంలు, కంప్యూటర్ ఆపరేటర్లు ఏండ్ల తరబడి పని చేస్తున్నప్పటికీ గుర్తింపు లేదన్నారు. ప్రభుత్వం తమను జూనియర్ అసిస్టెంట్‌గా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో డీపీఎంలు, ఆపరేటర్లు లక్ష్మణ్, శ్రావణ్, శ్రీనివాస్‌రెడ్డి, సాగర్, కృష్ణ, ఎల్లం, శాలిక, సంతోశ్, రాజేందర్‌రెడ్డి, సుమలత, సంపత్, మహేశ్, నవీన్, స్వామి, మున్నన్, సోహైల్, నర్సింహులు, బాలరాజు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలను సాధించాలి

- యువత చెడుదారులు తొక్కకూడదు
- తెలంగాణ హైకోర్టు జడ్జి సామ్ కోషీ



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి సామ్ కోషీ

సిద్దిపేట అర్బన్/ హుస్నాబాద్ రూరల్, సెప్టెంబర్ 30 : యువత చెడుదారులు తొక్కకుండా ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలని తెలంగాణ హైకోర్టు జడ్జి సామ్ కోషీ తెలిపారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో జరిగిన లీగల్ అండ్ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమంలో హైకోర్టు జడ్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి సామ్ కోషీ మాట్లాడుతూ.. యువకులు, సామాన్యులను టార్గెట్ చేస్తూ సైబర్ నేరగాళ్లు, డ్రగ్ మాఫియా రెచ్చిపోతుందన్నారు. ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయని, అవగాహన లేకనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్, బెంగళూర్, ముంబై మహానగరాలతోపాటు పట్టణాల్లో కూడా యువత గంజాయి లాంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు బాధితులకు అవగాహన కల్పించి, వారిని మత్తు నుంచి విముక్తి చేయాలన్నారు. అథారిటీ మెంబర్ సెక్రటరీ గోవర్ధన్ రెడ్డి మాటాడుతూ.. సైబర్ నేరాలపై విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జడ్జి రఘురాం, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, సీపీ శ్వేత, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

**న్యాయ వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలి**

**★ అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి కృష్ణతేజ**

న్యాయవ్యవస్థపై విద్యార్థులకు అవగాహన ఉండాలని హుస్నాబాద్ అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి కృష్ణతేజ అన్నారు. పోతారం(ఎస్)లోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సమాజంలో నేరాలు పెరిగిపోయాయని, క్షణికావేశానికి లోనై నేరాలకు పాల్పడితే శిక్షలు అనుభవించాల్సి ఉంటుందన్నారు. సోషల్‌మీడియాను అవసరానికి మాత్రమే వినియోగించాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. పేదలకు న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయసేవలు అందిస్తున్నది తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది ప్రవీణ్ పాల్గొన్నారు.



హుస్నాబాద్‌రూరల్ : న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి కృష్ణతేజ

### నిమజ్జనంలో అపశృతి..

## నీట మునిగి యువకుడు మృతి



కంది శ్రీకాంత్ (ఫైల్)

మిరుదొడ్డి, సెప్టెంబర్ 30 : నిమజ్జన ఉత్సవాల్లో అపశృతి జరిగింది. కుంటలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మిరుదొడ్డి మండలపరిధిలోని చెప్యాల గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాలు. చెప్యాల గ్రామంలో గణేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నవరాత్రులను పూర్తి చేసుకున్న సందర్భంగా నిమజ్జన ఉత్సవాలను వైభవంగా నిర్వహించి కుమ్మరికుంటలో శుక్రవారం అర్ధరాత్రి గణనాథుడిని నిమజ్జనం చేశారు. నిమజ్జనం పూర్తి కాగానే యూత్ అసోసియేషన్ సభ్యులు వెనుదిరిగి చూసేసరికి కంది శ్రీకాంత్(28) కనిపించలేదు. శనివారం ఉదయం కుమ్మరి కుంటలో గాలించగా శ్రీకాంత్ శవమై కనిపించాడు. మృతుడి భార్య వనజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరేశ్ తెలిపారు. మృతుడికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ఏరియా దవాఖానకు తరలించారు.

## ఫీల్డ్ ఆఫీసర్లకు తోర్నాలలో శిక్షణ

- సాగు పద్ధతులు, యంత్రాల వినియోగంపై అవగాహన

సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 30 : వ్యవసాయ పరిశోధన స్థానం తోర్నాలలో దేశ్‌పాండే ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థకు చెందిన కర్ణాటక, ఏపీ, తెలంగాణలోని 25 మంది ఫీల్డ్ ఆఫీసర్లకు శనివారం శిక్షణతోపాటు క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఫీల్డ్ ఆఫీసర్లకు పంటల సాగులో స్థిరమైన పద్ధతులు, ఉత్తమ పద్ధతులు, నీటి నిర్వహణ, సహజ వనరుల వినియోగం, నేల ఆరోగ్యం, పోషకాల నిర్వహణ, పంటలో పోషకాల లోపాలను గుర్తించే అంశాలను వ్యవసాయ పరిశోధన కేంద్రం హెడ్ శ్రీదేవి వివరించారు. అనంతరం వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో సాగు పద్ధతులు, యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించారు.



ఫీల్డ్ ఆఫీసర్లకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు